ప్రేమ బలికోరుతుందా?

నేను ఆఫీసులో అడుగుపెట్టేసరికి టైము పదయింది. ఆఫీసు మొదలయ్యేది పదిన్నరకు గనుక నెమ్మదిగా రీడింగు రూముపైపు నడిచాను. అప్పటికే చాలా మంది చేరిఉన్నారు. కొంతమంది చెస్ ఆడుతున్నారు ఒకపైపు. ఇంకోమూల కేరమ్సు ఆడుతున్నారు మరికొందరు. మిగతా వాళ్ళు పత్రికలు చదువుతూ కూర్చొని ఉన్నారు. నా దృష్టి వీళ్ళందరీన్ని చుట్టి నారాయణ చదువుతున్న నవల "డెవిల్స్ అన్ ది ఎర్త్" మీద పడింది. వాడు కుర్చీలో జారిగిలపడి కూర్చొని, నవల పైకెత్తి చదువుతున్నాడు.

"రేయ్ ఎప్పట్నుంచి ఈ అలవాటు" అన్నాను వాడి కెదురుగా కూర్చుంటూ.

"ఏ అలవాటు?" పుస్తకంలోంచి దృష్టి మరల్చకుండానే అడిగాడు.

"అదేరా ఆఫీసు లైబ్రరీలోంచి పుస్తకాలు తెచ్చుకొని చదవడం."

"నా కేమంత దుర్గతి పట్టిలా. ఇది నేను డబ్బులిచ్చికొన్నాను"

"నువ్వా! డబ్బులుపెట్టి కొనడమా! ఒరేయ్ ఇంతకాలంనుంచి కలసి మెలసి పనిచేస్తున్నాం. ఏనాడయినా స్టాపు ముఖాన ఇన్ని టీనీళ్ళు పోయించావా? అంతెందుకు? మెంబర్‌షిప్ చందా కట్టాల్సివస్తుందని లైబ్రరీ పుస్తకాలను అడక్కపోతివి. ఇది చాలదూ, నీ పిసినారితనానికి నిదర్శనం."

"ఒరేయ్! బాబూ, ఆపరా నీ సొద." కణతలు రుద్దుకుంటూ పుస్తకం మూసి టేబుల్ మీద పడేశాడు.

"నిజం చెప్పరా, దయ్యా లున్నాయంటావా?" సందేహం వ్యక్తపరిచాడు.

నాకు నవ్వాగలేదు. పకాపకా నవ్వాను. నా నవ్వు విని విశేషమేమా అని కొంతమంది చేరితే, నారాయణ దయ్యాల టాపిక్ ఎత్తేసరికి ఉత్సాహంగా మరి కొందరు ముందుకు వచ్చారు.

ఇప్పటివరకు వాడు చదివింది దయ్యాల పుస్తకం గనుక, వాడిలో ఆ టెన్షన్ ఇంకా పోలేదు. "రేయ్, నేను అషామాషీగా అడగడం లేదు. సీరియస్‌గా అడుగుతున్నాను. నీ ఉద్దేశం చెప్పు" అన్నాడు.

వాడికి నా మాటమీద చాలా నమ్మకముంది. నేను ఏది మాట్లాడినా రీజనింగ్ ఉంటుందని అంటూంటాడు. అందుకే మొదట నా ఉద్దేశం అడిగాడు. మిగతా సీట్లలో కూర్చున్నవారంతా మాట్లాడడంఆపేసి నేనేం చెబుతానోనని ఆత్రతగా ఎదురు చూస్తున్నారు. వాళ్ళ ఆత్రతకు నాకు నవ్వొచ్చింది. ఎందుకో ఈ మానవులు లేనిదాన్ని ఉన్నట్లుగా వూహించుకొని అనుభూతి చెంది ఆనందిస్తుంటారు అను కొన్నాను. వాతావరణం సీరియస్ కావడంతో నేనూ సీరియస్ అయ్యాను.

"నో!.....నో!!..... దయ్యాలు లేవు, భూతాలు లేవు. ఇవన్నీ కట్టుకథలు. రాళ్ళను ఆయుధాలుగా చేసుకొని జంతువుల్ని చంపి పచ్చిమాంసం చీల్చుకొని తినే రాతియుగం నుంచి సృష్టిలో అతి చిన్నదైన అణువుతో ప్రపంచాన్నే భస్మీపటలం చేయగల అణుయుగంలోకి చేరుకున్నాడు నేటి మానవుడు. ఇంకా ఆ కాకమ్మ కథలు వినడానికి సిద్ధంగా లేడు. తీరికా లేదు" అన్నాను కొట్టిపారేస్తూ.

నారాయణ నా రీజనింగును ఒప్పుకోలేదు. "ఆఫ్టారల్ నువ్వు చెబితే సరి పోద్దా? ఇంతింత పెద్ద నవల్లు వ్రాసిన అమెరికన్స్‌కి అది తెలియదంటావా? వాళ్ళు సైన్సులో మనకంటే ఎంతో ముందున్నారు తెలుసా."

ఎప్పుడూ నా వాదనను సమర్థించే స్టాఫు ఈ విషయంలో నాకు వ్యతిరేక మయ్యారు. ఒకరికొకరు దయ్యాలతో తమ చిన్ననాటి అనుభవాలను చెప్పుకొంటు న్నారు. తమ తాతల హయాంలో దయ్యాలు విచ్చలవిడిగా ఇండ్లలో తిరిగేవవి, వాటిని తమ తాతలు మంత్రశక్తితో బంధించి అన్నిపనులు చేయించుకొనేవాళ్ళని చెప్పుకుంటున్నారు.

"మీలో ఎవరయినా దయ్యాన్ని చూశారా" అన్నాను కోపంగా.

"మన ఆఫీసులో దయ్యాలున్నాయి తెలుసా" అన్నాడు పంతులు జవాబుగా.

"నో నెవర్.....ఇంకోసారా మాట అన్నావంటే పళ్ళూడ పీకేస్తాను."

"నీకేం తెలుసోయ్ అట్లా ఎగిరిపడతావ్? అతనెందుకు నేను చూశాను దయ్యాన్ని. మన ఆఫీసులో నా రెండేళ్ళక్రితం అనుభవం చెబుతాను విను" మొదలు పెట్టాడు ఏభై సంవత్సరాల "ఆర్" సెక్షన్ హెడ్.

అందరూ బెల్లంకొట్టిన రాయిల్లా అయిపోయి చెవులు రిక్కించి వినసాగారు.

"వర్కు పెండింగు ఉండడంతో ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకే నేను ఆఫీసులో అడుగుపెట్టాను. వాచ్‌మన్ తప్ప ఎవ్వరూ లేరు. నేను మేడ

మెట్లెక్కి నా సెక్షన్ చేరుకొని తాళం తీశాను. తలుపులు బార్లాతీసి నా సీట్లోకి వెళ్ళి ఫైళ్ళన్నీ బల్లమీద పెట్టాను. ఎవరో ఉన్నట్లు అలికిడి వినిపిస్తే చూశాను. దూరంగా టైపుమిషన్ దగ్గర అటు తిరిగి కూర్చొని ఉంది మా సెక్షన్ టైపిస్టు రజని. ఆమె నెత్తిన కొంగు కప్పుకొని ఉంది. అటుతిరిగి ఉండడంవల్ల ఆమె వీపు మాత్రమే నాకు కనిపిస్తూ ఉంది.

'ఈమె ఎప్పుడొచ్చిందబ్బా అనుకొన్నాను నా వెనకనే వచ్చిందేమోలే' అనుకొని నా పనిలో మునిగిపోయాను. ఒక గంట గడిచింది. ఆ ఫైలు వ్రాయడం పూర్తిచేసి, రెండో ఫైలు తీసుకొంటూ అటు చూశాను. గంటనుండి కూర్చొని ఉన్న ఆమె ఒక్క అక్షరం టైపుచేసిన శబ్దం లేదు. శిలలా అటుతిరిగి బిర్ర బిగిసి కూర్చొని ఉంది. ఆదీగాక ఎప్పుడూ అలవాటులేని నెత్తిన ఆ కొంగు....

నా కెందుకో అనుమానమొచ్చి "ఏం రజనీ, పెళ్ళి కాలేదని నిరాహారదీక్ష చేస్తున్నావా? లేక ఇంట్లో ఏదన్నా గొడవపడి ఇలావచ్చి కూర్చొని ఆలోచిస్తున్నావా" అన్నాను వేళాకోళంగా. అంతే. ఇటు తిరిగింది. నా గుండె పగిలింది. అక్కడుండేది టైపిస్టు రజని కాదు. ముఖమంతా తెల్లగా అలికినట్లుగా ఉంది. ముక్కు, కళ్ళు, నోరు ప్రత్యేకంగా లేవు. చూస్తుండగానే ఆ ఆకారం గాలిలోకి లేచింది. కాళ్ళు, చేతులు వెనక్కు తిరిగిఉన్నాయి. రెండు నిముషాల్లో క్రిందికి పరుగెత్తి ఆయాసం తీర్చుకున్నాను" అప్పుడే అది జరిగినట్లు గుండెను చేత్తో రాసుకుంటూ. తన అనుభవం చెప్పడం పూర్తిచేశాడు 'ఆర్' సెక్షన్ హెడ్.

సదరు అనుభవంలోని టైపిస్టు రజని భయంతో వణికిపోతూ, ప్రక్క నున్న ముంతాజు చేతిని గట్టిగా పట్టుకొంది. మిగతా వాళ్ళంతా భయంభయంగా చూస్తు న్నారు. పట్టపగలు ఉదయం పదిగంటల వేళ భయపడడంలో అర్థమే లేదు.

"సార్ మీరు పండుగపూట దేవాలయాల్లో హరికథలు చెప్తారటగా" అన్నాను నేను సెక్షన్ హెడ్ నుద్దేశించి.

"అవున్నాయనా! ఏదో దైవభక్తి గలవాడిని. నా జీవితాన్ని చరితార్థం చేసుకొందామని...."

"హుం! జీవితం చరితార్థం అయ్యేది మనిషిజీవితంలో తోటి మనిషికి చేసే మంచిచెడులను బట్టండీ. ఇంతకూ నేను చెప్పేదేమంటే మీరు చెప్పిన ఆ దయ్యం కథను ఒక పిట్టకథగా వాడుకోండి. అంతేగాని లేనిపోనివి ఇక్కడ చెప్పి అందర్నీ హడలుగొట్టకండి."

"నాలుగేళ్ళ క్రిందట గుమాస్తాగా చేరావో లేదో నన్నే అనేవాడివయ్యావా? నీ వయసుకంటే ఎక్కువ సర్వీసున్న నన్నే అవమానిస్తావ్" అంటూ చిందులు వేస్తూ వెళ్ళిపోయాడు హెడ్.

"రేయ్, నువ్వు అదీ వినకపోతే నా ప్రార్థనను మన్నించి నా అనుభవం విను." 'సి' సెక్షను గుమాస్తా పంతులు ప్రాధేయపడుతూ ముందుకు వచ్చాడు.

"సరే చెప్పు" అన్నాను.

"నేనూ, మా సెక్షన్ హెడ్డూ ఆరోజు అందరిలాగే సాయంత్రం ఆరుగంటల కల్లా క్రిందికి వచ్చాం. వాచ్‌మన్ గేటు తలుపులు వేసుకొన్నాడు. మేము కాంటిన్‌లో కాఫీత్రాగి మాట్లాడుకొంటూవుండగా, 'పంతులు ఫైలు టైపుకిచ్చి మర్చిపోయానోయ్. అది చాలా కాన్ఫిడెన్షియల్ ఫైలు. రేపుఉదయం ఎవరయినా చూస్తే సీక్రెట్ బయటపడుతుంది' అన్నాడు. సరే ఫైలు తెద్దాం అని ఇద్దరం బయలుదేరాం. మా సెక్షన్ హెడ్ తనసీట్లో కూర్చొని, 'పంతులూ ఫైలుతీసుకొని రా వెళ్దాం' అన్నాడు. నేను ఫేర్‌కాపీ సెక్షన్‌వైపు నడిచాను. దానికి తాళం వేసి ఉంది. అయినా నా దగ్గరున్న తాళంతో ప్రయత్నించాను. ఉహుఁ. రాలేదు.

నిరాశగా వెనుకకు తిరిగాను. ఇంతలో ఏదో చప్పుడయితే, ఆగి కిటికీలోంచి చూశాను. ఇంకేముంది? అన్ని టైపుమిషన్ల ముందు ఒక్కో దయ్యం కూర్చొని ఉంది. నైట్‌గౌన్‌లాగ పైన్నుంచి గిరకలదాకా గాలికి కదలాడే వైట్ టెరిలిన్ దుస్తుల్లో ఉన్నాయి. ఇంకో దయ్యమైతే గాలిలో తిరుగుతూ చేతిలోని బొమికను ఆడిస్తూ కమాండ్ చేస్తున్నట్లుగా ఉంది. వాటి పాదాలు, చేతివ్రేళ్ళు ప్రత్యేకంగా కనిపించడం లేదు. పరుగెత్తుకు వచ్చి మా సెక్షను హెడ్‌కు చెప్పాను. దాంతో ఆయన వెర్రెత్తిపోయి 'పంతులూ! అవి దయ్యాలు నాయనా. వాటికి ఆహారం సంపాదించుకొనే వేళ అయ్యింది. మనమిక్కడ ఒక్క క్షణమున్నా నంచుకొని తింటాయి.' అంటూ హడావుడిగా బయటికి వచ్చాడు. ఇద్దరం ఒకర్ని ఒకరం తోసుకుంటూ క్రిందికి పరిగెత్తాము."

"స్టాపిట్.... డోన్ట్ టాక్ నాన్సెన్స్" అరిచాను పంతులు చెప్పేది వినలేక.

"అవును, బాబూ! ఇది నిజం. నేను ఆ సెక్షన్ హెడ్‌ను" 'సి' సెక్షను హెడ్ ఏదో చెప్పబోయినవాడల్లా, నేను ఉరిమిచూడ్డంతో ఆగిపోయాడు. నాకు ఒకరిని శాసించే అధికారం లేకపోయినా, ఒక విద్యావంతుడిగా, నవీన భావాలున్న యువకుడిగా, మూఢ విశ్వాసాలను ఖండించే నాగరికుడిగా నాకా హక్కు ఉంది

మూఢవిశ్వాసాలే దేశ పురోభివృద్ధికి, సంఘ పురోభివృద్ధికి ప్రతిబంధకాలని దేశ శ్రేయస్సుకోరే ప్రతి విద్యావంతుడికీ తెలుసు.

"ఎస్! మీ రందరూ చెప్పినట్లు మన ఆఫీసులో, దయ్యాలు ఉన్నాయని నేను నమ్ముతున్నాను. అయితే నేను పరీక్ష చేయాలి. ఈ రోజు రాత్రికే నా పరిశోధన. ఆసక్తి ఉన్నవాళ్ళు నాతో వచ్చి తెలుసుకోవచ్చు" అన్నాను లేచి నిలబడి.

"నేను రెడీ" అన్నాడు రాజేష్.

"నేనూ మీతో వస్తాను" ముందుకు వచ్చాడు వాసు.

"మాకు చాలా ఇంటరెస్టుగా ఉంది. మేమూ వస్తాం" అంటూ డేవిడ్, పంతులూ ముందుకు వచ్చారు.

లేడీస్‌లో చిన్న కలకలం బయలుదేరింది.

"సార్, మీరు అనవసరంగా పులినోట్లో తల పెడుతున్నారేమో" అంది భయంగా చెపిస్తు రజని.

"ఎందుకొచ్చిన పీడ సార్, ఇది. మనపనేదో మనం చేసుకొని పోక" ముంతాజ్ అంది.

"ఏమండోయ్, వాటిని ఒక్కసారి కదలించారంటే, అవి అందరికీ ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి." అందుకొంది శోభారాణి.

"సార్, నా రిక్వెస్టు దయచేసి వినండి. ప్రశాంతంగా ఉన్న మీ జీవితంలోకి కోరి కష్టాల్ని ఆహ్వానించకండి మన ఆఫీసులో ఎవరికి ఇబ్బంది కలిగినా అందరమూ బాధపడతాం" అంది రాగిణి నాకేదో ప్రమాదం జరిగినట్లే భయపడుతూ.

నేను ఖచ్చితంగా చెప్పాను నా పరిశోధన తప్పదని, వాటిఅంతు ఈ రోజే తేలుస్తానని. నా దృష్టి దూరంగా కూర్చుని ప్రశాంతంగా మా మాటలు వింటున్న అశోక్‌మీద పడింది. ఇంత కలకలం రేగినా వాడిలో అణుమాత్రం చలనం లేదు. వాడి ధైర్యానికి మెచ్చుకొన్నాను.

"ఏరా, మాకు సహాయం రావా" అన్నాను.

"ఛ.... ఛీ.... మా నాయనమ్మ దయ్యాల కథలే విన్నవద్దంది. విన్నా ప్రమాదమేనట. అందుకే ఇప్పటివరకూ చెవుల్లో వ్రేళ్ళు దూర్చుకొని ఇప్పుడే తీశాను" అన్నాడు.

"ఒరేయ్, అశోక్ నీకు దేవుడు హెర్క్యులిస్‌కున్న కండలిచ్చాడు గాని, చీమతలంత గుండెధైర్యాన్నివ్వడం మరచిపోయాడురా" అన్నాను, వాణ్ణి పెద్ద ధైర్యస్థుడని అంచనా వేసినందుకు నన్ను నేను తిట్టుకొంటూ.

టైమ్ కావడంతో ఎవరి సీట్లలోకి వాళ్ళు వెళ్ళిపోయాం. ఆరోజు సాయంత్రం వరకూ దయ్యాల పరిశోధన మానుకోమని ఎవరో ఒకరు చెబుతూనే ఉన్నారు.

2

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకు అనుకొన్న ప్రకారం అందరూ ట్రంకు రోడ్డులోని సీమా హోటల్ ముందు చేరాము. రాజేష్ తనతోపాటు రెండు మీటర్ల పొడవున్న కర్రలు వో నాలుగు కట్టితెచ్చాడు. వాసు తనసంచీలో దాదాపు పదిహేను మీటర్ల పొడవున్న లావుపాటి తాడు పట్టుకొచ్చాడు. అది అతని సంచిలో చుట్ట చుట్టుకొని ఉన్న పాములా పడిఉంది. డేవిడ్ నైఫ్ తెచ్చాడు. పంతులుమాత్రం చేతులూపుకుంటూ వచ్చాడు. నేను టార్చి మాత్రమే తెచ్చాను.

అర్ధరాత్రిపైన అయితే పరిశోధన జయప్రదంగా జరుగుతుందని, ప్రశాంత మయిన ఆ సమయంలో ఎంతో అనుకూలిస్తుందని వాళ్ళకు చెప్పి, అందర్నీ లీలా మహల్లో 'ఎగ్జార్సిస్టు' సినిమా సెకండ్ షోకి తీసుకువెళ్ళాను.

సినిమా చూస్తున్నంతసేపూ అందరికీ గుండె దడగానే ఉంది. చివరి సన్ని వేశంలో నా ప్రక్కన కూర్చున్న పంతులు కుర్చీలో బిర్రబిగుసుకు పోయాడు. దయ్యాలతో హీరో ముఖాముఖిగా పోరాడుతున్న దృశ్యాలు శరీరాన్ని గగుర్పొడి పిస్తున్నాయి. సినిమా అయిన తర్వాత అందరం అఫీసువైపు దారితీశాము.

సైన్సు బాగా అభివృద్ధిచెందిన దేశాల్లోనే దయ్యాలమీద సినిమాలు తీస్తు న్నారు. నవలలు వ్రాస్తున్నారు. అటువంటప్పుడు ప్రజలు విజ్ఞానవంతులయ్యారని అనుకోవాలా లేక అజ్ఞానాంధకారంవైపు దారితీస్తున్నారని అనుకోవాలా అనేది నన్ను వేధించే సమస్య.

ఆఫ్రికా ఖండంలోని కొన్ని వెనుకబడిన జాతుల్లో ఇప్పటికీ దయ్యాలమీద చాలా నమ్మకముంది. మగదయ్యాల్ని డెవిల్స్ అని, ఘోస్ట్స్ అని అంటే, ఆడ దయ్యాల్ని విచెస్ అని అంటారు. టెంపర్‌మెంట్‌లోను, సెన్సిటివ్‌నెస్‌లోను ఆడ దయ్యాలు మగదయ్యాలకంటే ఎంతో యాక్టివ్‌గా ఉంటాయంటారు. విచెస్‌లో నాలుగు రకాలున్నాయి. హెడ్ విచ్‌ను డెమన్ అంటారు. మిగతావి హైయర్ విచ్,

లోయర్ విచ్, వర్కర్ విచ్ అని తమతమ స్టేటస్‌ని బట్టి విధుల్ని నిర్వర్తిస్తుం టాయి. ఇవి అర్ధరాత్రి డెమన్ నాయకత్వంలో శ్మశానంలో సమావేశ మవు తుంటాయి.

వీటికి సంబంధించిన మంత్రగాళ్ళు కూడా భూమ్మీద ఉన్నారు. శత్రువుల మీద పగతీర్చుకోడానికి విచ్ క్రాఫ్ట్స్ అనే మంత్రగాళ్ళను వాడుకొంటారు అక్కడి ప్రజలు. ఆ మంత్రగాళ్ళు చేతబడుల్లాంటి క్షుద్ర విద్యలతో అవతలివాడిని పిచ్చి పిచ్చిచేసి తరువాత చంపేస్తారు. ఇంకోరకం మంత్రగాళ్ళు ఉన్నారు. వాళ్ళను 'సోర్సర్స్' అని పిలుస్తారు. వీరు చాలా మంచివారు. విచ్‌క్రాఫ్ట్స్‌కంటే ఎక్కువ శక్తివంతులు. వీళ్ళు చేతబడులని తిరగ్గొట్టి అనారోగ్యంగా ఉన్న వ్యక్తిని ఆరోగ్యవంతునిగా చేయడం, దుర్మార్గులయిన మంత్రగాళ్ళు చేసే ప్రతిపనికి అడ్డు పడి ప్రజల్ని ఆదుకొనడంచే మంచివాళ్ళనిపించుకొంటారు సోర్సర్స్. ఈ ప్రాంతపు ప్రజలు ఆ విధంగా దయ్యాలకు తమ దైనందినజీవితాల్లో ప్రథమ స్థాన మిచ్చారు.

ఆలోచనల్లోనే ఆఫీసుకు చేరాము. ఆఫీసు తూర్పుముఖంగా ట్రంకురోడ్డును ఆనుకొని ఉంటుంది. ఆఫీసు ఎడమవైపు ఆర్. అండ్ బి. ఆఫీసు భవనాలు, కుడి వైపున స్టేట్ బ్యాంక్ హెడ్‌ఆఫీసు ఉన్నాయి. వెనుకవైపున శ్మశాన ముంది. వెన్నెలరాత్రుల్లో అందులోని సమాధులు రాజదర్బారులో సమావేశమైన ముఖ్యో ద్యోగులను జ్ఞప్తికి తెస్తుంటాయి

సమయం ఒంటిగంట కావటంతో ఒకటీ అరా లారీలు రోడ్డుమీద పోతు న్నాయి. జనసంచారం లేదు. మెయిన్‌గేటు మీద చేయివేసి, "యానాదీ...... యానాదీ...." అంటూ వాచ్‌మన్‌ని పిలిచాను.

వరండాలో నిద్రపోతున్న యానాది లేచి లైటువేశాడు. మా దగ్గరకు నడిచి వచ్చి మెయిన్‌గేటు తలుపు తాళంతీసి, "యాండి సావులు ఇట్టా వచ్చిర్రు" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు.

"అర్జంటు పనుందిలే లోపలికి పద చెబుతాను" అన్నాను. అందరూ నా వెనకనే నడిచారు. అందరం వరండాలోకి వచ్చాము. యానాది యథాస్థానంలో కూర్చొని బట్ట చుట్టుకుంటూ మా సమాధానంకోసం ఎదురుచూడసాగాడు.

" నాదీ! ఆఫీసు తలుపులు తియ్యి. లోపలికి వెళ్ళాలి" అన్నాను.

"ఈ పొద్దప్పుడు యాంపని సామే. సెప్తన్రు."

నేనేదో చెప్పబోయాను ఇంతలో "మేం మన ఆఫీసులో దయ్యాలున్నాయా లేవా అనే పరిశోధన చేయడానికి వచ్చాం" అని పంతులు గబుక్కున అనేశాడు.

"ఏంది దయ్యాలుండయా లేదా అని పరిచ్చ సేయడానికొచ్చిన్రా, సారులూ. ఇంతకీ ఇంటికాడ ఈ సంగతి తెలుసా అంట!" నవ్వుతూ అడిగాడు యానాది.

"అవన్నీ నీకెందుకు? ముందు తాళాలు తియ్యి" అన్నాడు దురుసుగా వాసు.

"అయితే నేనో సంగతి చెప్తా. ఇని ఆనక మీ నిర్ణయం చెప్పండి" అంటూ చెప్పడం మొదలుపెట్టాడు యానాది.

"అది నేను వాచ్‌మాన్‌గా చేరిన మొదటిరోజు బాబులూ. ఈడనే మేడమెట్ల దగ్గర సాప పరుసుకొని దుప్పటి కప్పుకొన్నా. రేత్తిరి పన్నెండు గంటలు అయ్యే సరికి ఎవరెవరో మీద నడిసిపోయినట్టుగా ఉండాది. యాందిరా సిత్రం అని ఆలో చిత్తనే ఉన్నా. ఎవరో ఫెడీమని తన్నారు. అంతదూరంలో ఎల్లి పడ్డా. ఏంది మాయ—ఏసిన తలుపులు ఏసినట్టే ఉండాయి. ఇదంతా ఏదయినా కలా, బెమా అనుకుందామంటే దెబ్బ తగిలిన నడుము పీకుతుందే...."

"తర్వాత ఏమయింది?" ఆత్రంగా అడిగాడు పంతులు.

"నేనన్నీ సెప్తా. అట్టా బయపడిపోమాకండి, సారూ. అమాయిన కొద్ది సేపుండి, ఏట్లేదులే అని నాలోనేను సర్దిసెప్పుకొని మళ్ళా పడుకొందునుగందా, మళ్ళా వందలమంది నామీద నడిసిపోయినట్లుండాది. ఏందిది? అని కళ్ళుతెరిసే లోగా ఎవడో లాగి తన్నినట్లు ఆడబోయి పడితిని. ఒక పన్నాడె. నేను ఎక్స్ మిలటరీ మనిషిని గందా. నానేం భయపడ్లా. ఏందీ తమాసా అని లైటువేసుకొని ఆఫీసంతా తిరిగి-సూత్తిని, ఏటి లేదు నిద్రకు ఉండలేక పడుకోవడం, తన్నించు కోవడం ఈ ఇదంగా తెల్లవారులూ తంటాలు పడితిని. తెల్లారి ఇంతకుముందు ఇక్కడే వాచ్‌మన్‌గా పనిచేసి మానుకొన్న తిరపతిదగ్గర కెళ్ళి ఇసయం అడిగితిని. ఆడు అసలు సంగతి సెప్పిండు గందా...."

"అసలు సంగతేమిటి?"

"ఒరే, యానాదిగా, ఆడదయ్యా లుండయిరా. అయి ఎల్లే మార్గాల్లో పడు కొంటే అన్నే తంతయి. అందుకనే గందా నేను ఉద్యోగం మానుకొండి'అన్నాడు. ఆనాటినుంచి నేను జాగర్తగా సూసి, పడుకోడానికి పెమాదంలేని ఈనోటు

ఏన్నుకొన్నా." వాచ్‌మన్ చెప్పడం ఆపి, "ఏటి, అట్టా సూత్తుండరు. ఇకను గూడా పరిసోదన సేత్తరా" అన్నాడు.

అందరూ నా ముఖాలు చూస్తుంటే నాకు ఒళ్ళు మండింది. "ఏరా, అలా బిత్తరపోయి చూస్తారు? భయమైతే మీ రింటికి వెళ్ళండి. నే నొక్కడ్నే వాటి అంతేదో తేల్చుకొని వస్తాను." చిర్రుబుర్రుగా అన్నాను.

"అబ్బబ్బే, అదేం కాదురా. యానాది ప్రశ్నకు నువ్వు కిరెట్టు సమాధానం చెబుతావేమోనని చూస్తున్నాము" నొచ్చుకుంటూ అన్నాడు రాజేష్. మిగతా వాళ్ళంతా నాకు క్షమాపణలు చెప్పుకున్నారు.

"సామీ, బవిసెత్తు గల్లోళ్ళు. ఆటి జోలి కెళ్ళకండి. నా మాటిని ఈ పని మానుకోండి. మిమ్మల్ని పార్దిత్తా" అన్నాడు చేతులెత్తి.

"ఇదిగో, యానాదీ ఈ విషయంలో ఎవరు ఏంచెప్పినా వినేదిలేదు. నీ దగ్గ రున్న ఆఫీసు తాళాలు నా కిచ్చెయ్. నీకు మాటరాకుండా చూసే బాధ్యత నాది" అన్నాను తాళాలకోసం చేయి ముందుకు చాచి.

యానాది ఏమనుకున్నాడో ఏమో ఖద్దరు బనీను జేబులోంచి తాళాలగుత్తి తీసి నా చేతిలో పెడుతూ, "సామే, మీరు ఇంతగట్టిగా అడిగినను కనుక ఇత్తుండా ఇక రేపట్నుంచి ఈ ఆఫీసులో నేను పనిసేయలేను. ఈ ఊళ్లోనే ఉన్న బ్రాంచి ఆఫీసుకి వాచిమన్‌గా ఏయమని అర్జీ ఇచ్చుకుంటా. లేకపోతే ఇప్పుడు మీరు రెచ్చగొట్టిన దయ్యాలు నన్ను భూమ్మీద ఉండనిత్తా యనుకున్నారా? నేను ఇప్పుడే ఎళ్ళిపోతున్నా" అన్నాడు. అలా అనటమేమిటి, వెంటనే గుడ్డలమూట, చాప సంకలో పెట్టుకొని మేము చూస్తుండగానే గేటు తీసుకొని రోడ్డుమీదికి వెళ్ళిపోయాడు.

నేను మెయిన్‌గేటు లాక్‌చేసి వచ్చి, ఆఫీసు తలుపులు తెరిచాను. ఆఫీసు రెండంతస్తుల భవనం, నలుచతురస్రాకారంలో ఉంటుంది. భవనం మధ్యలో చాలా ఖాళీస్థలం. ఆకాశం కనిపిస్తూ ఉంటుంది. సాయంత్రం పూట ఏదయినా ఉపన్యాసాలు ఏర్పాటుచేస్తే అక్కడ జరుగుతాయి. ఆఫీసు భవనం కింద అంతస్తులో అంతా రికార్డ్సు, లేబొరేటరీ, మేడమీదికి మధ్యలో కిందినుంచి ఒకేదారి ఉంది. రెండవ అంతస్తు చేరుకోగానే అక్కడ కంట్రోలురూము ఉంది. అక్కడ రిసెప్షనిస్టు ఆఫీసుకొచ్చే ప్రతి కాల్ రిసీవు చేసుకొంటుంది.

కంట్రోలురూము ముందునుంచి బయలుదేరిన వరండా మేడమీద అన్ని గదుల్ని లోపలివైపున చుట్టుతుంది. 'ఎ' నుంచి 'జడ్' వరకు సెక్షన్లున్నాయి. 'జడ్' సెక్షను ఫేర్‌కాపీ సెక్షను. ఫేర్‌కాపీ సెక్షనులో ఆఫీసు మొత్తానికి సంబంధించిన కాగితాలు టైపవుతాయి. మొత్తం పాతికమంది టైపిస్టులు పనిచేస్తా రక్కడ. 'ఆర్' సెక్షన్‌లో వర్కు హెవీగా ఉంటుంది. కనక, వీళ్ళుకాక అక్కడో పర్మనెంటు టైపిస్టు పనిచేస్తుంది.

నేను ఒక్కో లైటు వేస్తూ మెల్లెక్కుతున్నాను. అందరం కంట్రోలురూము చేరుకున్నాం. పరీక్ష చేస్తూ కంట్రోలురూము దాటి ముందుకు నడుస్తున్నాను. అందరూ పరిస్థితి అబ్జర్వ్ చేస్తున్నారు. ఇంతలో కంట్రోలురూములోంచి గణగణమంటూ ఫోను మోగసాగింది నేను రాజేష్‌వైపు చూశాను. రాజేష్ నా చూపులోని భావం అర్థంచేసుకుని వెళ్ళి ఫోనందుకున్నాడు. నేను వెనక్కు తిరిగి చూస్తున్నవాణ్ణల్లా చటుక్కున పరుగెత్తి రిసీవరు అందుకున్నాను. లేకపోతే క్షణంలో అది వేలాడుతూ ఇనుప టేబులుకు కొట్టుకొని బద్దలయ్యేదే. రాజేష్ ముఖం చెమటతో నిండిపోయింది. మనిషి గడగడా వణికిపోతున్నాడు. ఏదో చెప్పాలని ప్రయత్నించి చెప్పలేకపోతున్నాడు. నేను వాడి భుజంతట్టి రిసీవరు చెవిదగ్గర పెట్టుకున్నాను.

ఏనాడూ భయం ఎరగని నాకు కాళ్ళలో వణుకు మొదలయింది. ఫోనులోంచి వినబడే శబ్దాలు కర్ణకఠోరంగా ఉన్నాయి. ఒక కన్నెపిల్లి తనను బలాత్కరిస్తుంటే తట్టుకోలేక అరిచిన చావుకేక, పసిపిల్లవాడి ఏడుపు, సింహ గర్జనలు, మేక అరుపులు. లేగదూడ పాలకోసం 'అంబా' అని అరిచే అరుపు ఘీంకరిస్తూ పరుగెత్తే అడవి ఏనుగుల గుంపుల శబ్దాలు. పెనుతుఫానుకు ప్రచండంగా వీచే గాలి 'హోరు' మనే శబ్దం. అంత కలగా పులగంగా, అయోమయంగా ఉంది.

అందరూ నా వైపు ఆత్రంగా చూస్తున్నారు. భయాన్ని కప్పిపుచ్చుకుంటూ ఎవరికో జవాబు చెప్పినట్లుగా అన్నాను. "ఏమిటి ఆఫీసరుగారి కోసమా, వారు లేరండి. రేపు ఉదయం పది గంటలకు ఫోను చేయండి" అంటూ టప్పున రిసీవరు పెట్టేశాను. ముఖంమీద పట్టిన చెమట కర్చీప్‌తో ఒకటికి రెండుసార్లు తుడుచుకున్నాను.

"రాజేష్, జరిగిన విషయం మనవాళ్ళతో అనకు. చాలా ప్రమాదం" అన్నాను వాడి చెవిలో.

"ఆనంద్! మొత్తానికి దయ్యాలు అప్పుడే వాటి ప్రతాపం మొదలెట్టాయిరా" అన్నాడు రాజేష్ చిన్నగా నాకే వినిపించేట్టు.

3

"ఏమిటి, ఏం జరిగింది" అన్నారంతా.

"ఏమీ జరగలేదు పదండి" అన్నాను.

నేను వరండాలో రూములమీదుగా 'ఎక్స్' సెక్షను దాటి, 'వై' సెక్షను రూము తలుపులు తెరిచాను. కారణం, పక్కనే దయ్యాల కేంద్రస్థానమని పిలువబడే ఫేర్‌కాపీ సెక్షను ఉంది. ఒక సెక్షను తలుపు తెరిస్తే చాలు, మిగతా అన్ని సెక్షన్ల లోకి లోపల్నుంచి వెళ్ళొచ్చు. అందరం లోపలికి ప్రవేశించాము. లైట్లన్నీ దేదీప్యమానంగా వెలుగుతున్నాయి.

అందరూ తమదగ్గరున్న వస్తువుల్ని ఒక టేబుల మీద చేర్చారు. ఎవరికి అవసరమైన ఇన్‌స్ట్రక్షన్స్ వాళ్ళకు ఇవ్వాలని అందర్నీ హాలుమధ్యకు రమ్మన్నాను. నా కెదురుగా నిలబడ్డారు. నేనేం చెబుతానోనని చెవులు రిక్కించి ఉన్నారు. సూది పడితే వినిపించేంత నిశ్శబ్దం.

"ఇప్పుడు మనం...." మొదలుపెట్టానో లేదో కరెంటు పోయింది గాడాంధ కారం. అమావాస్య రాత్రులు కావడంతో బయట చీకట్లో ఏం కనిపించడంలేదు. టప్పున నా చేతిలోని టార్చి వెలిగించాను. వెలగలేదు. ఆశ్చర్యంతో కొయ్యబారి పోయాను. పరీక్షిస్తే సెల్సుకూడా ఆర్డరులోనే ఉన్నాయి. అది ఫర్లాంగు దూరం దేదీప్యమానంగా వెలిగే టార్చిలైటు. వెలగడంలేదు. ఏమిటీ మిస్టరీ?

"ఒరేయ్, రాజేష్. క్విక్ టేబులుమీదున్న కర్ర లందుకో" అన్నాను.

నేను అక్కడే నిలబడ్డాను. ఒకరి నొకరు తప్పిపోతారన్నట్లుగా నలుగురూ కలసి వెళ్ళినట్లు వారు కదలిన శబ్దాన్నిబట్టి గ్రహించాను. అయిదు నిమిషాలు గడిచాయి. కాని వాళ్ళు కర్రలు తేలేదు.

"ఏరా, ఎంత సేపు?" అసహనంగా అరిచాను.

"ఒరేయ్, టేబులు మీదుంచిన వస్తువులు ఒక్కటీ లేవురా." అందరూ ఏడుపు గొంతులతో అరచారు.

"బాగా వెతికారా?"

"ఆ!" మళ్ళీ అరిచారు. ఆఫీసు పెద్దభవనం కావడంతో ఒక్కో గొంతు పది గొంతులుగా ప్రతిధ్వనిస్తూ ఉంది.

"ఒరే! రండి....ఇలా ఇలా" అన్నాను. వాళ్ళు నా గొంతును బట్టి నన్ను చేరారు. వాళ్ళు నా కెదురుగా వచ్చి నిలబడిఉన్నారని ఆ చీకట్లో నే నూహించాను.

"డియర్ ఫ్రెండ్స్ మనం ఒకరికొకరం చాలా దగ్గరగా ఉన్నాం. చీకట్లో ఉన్నాం కాబట్టి దూరంగా ఉన్నట్లే లెక్క. మీ అందర్నీ ఒక్కొక్కరిగా పిలుస్తాను. విడివిడిగా పలకండి. తరవాత మీకు చెప్పాల్సింది చెబుతాను'' అంటూ "మిస్టర్ రాజేష్, వాసూ, డేవిడ్....పంతులూ" అంటూ పేరుపేరునా పిలిచాను.

అందరూ "ఎస్, ఎస్" అని జవాబిచ్చారు. వాళ్ళందరూ భయపడుతున్నారని అతి తేలిగ్గా తెలిసిపోతూ వుంది.

"మిత్రులారా! ఇప్పుడు మనం ఏదో పెద్ద ప్రమాదంలో చిక్కుకున్నామని భయపడకండి. దయ్యాలనేవి ఒకవేళ ఉంటే వాటికి మనంత ధైర్యంలేదని ఖచ్చితంగా చెప్పగలను. వాటికి ధైర్యమే ఉంటే ఇలా భయపడి చీకట్లో దాక్కోవు. వెలుతురులోనే మనతో ముఖాముఖి పోట్లాడేవి."

ఇంతలో ఫేర్‌కాపీ సెక్షనులోంచి టైపుమిషనుమీద టపటపా మని చప్పుడు మొదలయింది. మామూలుగా టైపు హయ్యరువాళ్ళు కొట్టేడానికంటె ఇంకా హై స్పీడుగా ఉంది టైపు. కొద్దిక్షణాల తరువాత ఇంకో టైపుమిషనుమీద కూడా టైపు మొదలయింది. జారిపోతున్న గుండెను చిక్కబట్టుకున్నాను.

"రాజేష్...." పిలిచాను. జవాబు లేదు. మిగతా వాళ్ళందరినీ పిలిచాను. ఎవరిదగ్గరనుంచి సమాధానం రాలేదు.

"టైపు చేసేది ఎవరు?" గర్జించాను.

టైపు శబ్దం ఆగిపోయింది. తరువాత కిలకిలమంటూ ఒక కన్నెపిల్ల నవ్వు అలలు అలలుగా తేలివచ్చింది. తరువాత ''హ్హా....హ్హా" అని ఒక పురుషగొంతు భయంకరంగా వినిపించింది.

"ఏయ్, ఎవరు మీరని అడిగితే నవ్వుతా రెందుకు?"

నవ్వు ఆగిపోయింది. ఒక అరనిమిషం భయంకరమైన నిశ్శబ్దం. తరువాత లౌడ్‌స్పీకరులోంచి మాట్లాడినట్లుగా, "మేం దయ్యాలం. మమ్మల్ని అంతుతేల్చుకోవడానికి వచ్చారే మీ కెంత ధైర్యం? నేను నా శతసహస్రకోటి దయ్యాల్ని పంపి మిమ్మల్ని ఎముకకు ఎముక, కండకు కండగా చీల్చి తింటాం. మీ కిక్కడ దిక్కెవరు?" మాట్లాడిన ప్రతిమాట దూరంనుంచి రీసౌండులో వినిపించాయి.

''ఒరేయ్ రాజేష్, పంతులూ, అందరూ వినండి. రామన్న ప్రమాదం రాక మానదు. మనం వెనక్కు తగ్గితే దేనికీ పనికిరాకుండా పోతాము. అందుకని మనం ప్రాణాలకు తెగించి పోరాడాలి. ఓ.కె." అన్నాను.

"ఓ. కె." అన్నా రందరూ. నాకు చాలా సంతోషం వేసింది.

"చూశావా, మోహినీ! వీళ్ళు మనతోనే తగాదాకి దిగారు. ఇక వీళ్ళకు నూకలు చెల్లినట్లే!" పురుషకంఠం అంది.

"అవును, పాపం. ఈ రోజుతో వీరి చరిత్రలు తెరమరుగవుతాయి." మోహిని కిలకిల నవ్వింది. తరువాత ఇద్దరూ పగలబడి నవ్వారు. ఆ నవ్వును భవనంలోని అన్నిగోడలూ ప్రతిధ్వనింపజేశాయి.

"ఫ్రెండ్స్, గెట్ రెడీ. రాజేష్! నువ్వూ, పంతులూ కుడివైపు వెతకండి. వాసూ! నువ్వూ, డేవిడ్ ఎడమవైపు చూస్తూ రండి. నేను మధ్యలో ఉంటాను. ఎవరికి చిక్కినా ఏమాత్రం భయపడకుండా బంధించి వేయండి. ఎవరు ఎప్పుడు పిలిచినా అందరూ అటెన్షన్‌లో ఉండాలి. క్విక్. కదలండి" అంటూ అరిచాను.

అంతే. ఎవరి డైరెక్షన్‌లో వాళ్ళు అనుకున్న ప్రకారం ఫేర్‌కాపీ సెక్షనులో ప్రవేశించాము. దూరంగా ఉచ్ఛ్వాస, నిశ్వాసలు వినవస్తున్నాయి. ఆ వైపు పరుగెత్తబోయి స్టూలు తన్నుకుని, బోర్లా పడ్డాను. ఇంకోవైపునుంచి కిలకిలా నవ్వు. ఆ వైపు పరుగెత్తబోతే అక్కడ టేబులుమీద సైక్లోస్టైలుమిషను గుండెని గుద్దుకుంది. మిగతావాళ్ళు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నట్లు దూరంగా చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. ఒకవైపునుంచి కిలకిల మని నవ్వు వినిపించడం, ఆవైపు వెడితే ఇంకో వైపునుంచి వినిపించడం—ఇలా చీకట్లో మా వేట ఒక అరగంట జరిగింది.

"అమ్మోయ్! నాయనోయ్! చచ్చాను. దయ్యం కడుపులో గుద్దింది!" కెవ్వున అరిచాడు డేవిడ్.

"డేవిడ్! నువ్వా! అయామ్ వెరీ సారీరా. మెత్తగా తగిలేసరికి దయ్యమని...." క్షమాపణ చెప్పుకున్నాడు వాసు.

ఇంతలో నన్ను తోసుకుంటూ ఒక ఆకారం ముందుకు పోసాగింది. క్షణం ఆలస్యం చేయకుండా ఎగిరి మీదపడి, కదలకుండా చేతులు వెనక్కి విరిచి పట్టుకుని ఇంకోచేత్తో గొంతు బిగపట్టాను.

"చెప్పు. ఎవరు నువ్వు? ఇంతసేపూ దయ్యంగా నటిస్తూ ఎందుకు మమ్మల్ని కలవరపెట్టావు" అంటూ కుదిలించాను.

ఆ ఆకారపు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు భారంగా ఉన్నాయి తప్ప మాటల్లేవు.

"చెప్పు. ఎవరు నువ్వు, ఎక్కడ ఆ ఆడదయ్యం?"

ఆ ఆకారం తన మెడను అటూ ఇటూ గింజుకొంది.

"ఇప్పుడు చెప్పు" అంటూ గొంతు వదులుచేశాను.

"ఒరేయ్, ఆనంద్. నేను రాజేష్‌ని రా. అక్కడ దయ్యం నవ్వువిని పరిగెడుతూ ఉంటే నీ చేతిలో పడ్డాను. మాట్లాడనీకుండా నా గొంతు బిగిస్తివి." ఆయాసపడుతూ చెప్పాడు రాజేష్. నా చేతులు వాటంతట అవే జారిపోయాయి.

ఇంతలో భయంకరంగా అరిచాడు పంతులు. "ఇదిగో, దయ్యం పోతూంది. పట్టుకోండి.... బాబోయ్.... మెడమీద గుద్దింది." దబ్బున బోర్లాపడ్డ శబ్దం వినిపించింది. ఎవరెవరో పరుగెడుతున్న సవ్వడి. వెనకనే గాజులశబ్దం కూడా వినిపిస్తూ ఉంది.

అందరం పంతులున్న చోటికి పరుగెత్తాము. పంతులు ఫేర్‌కాపీ సెక్షను గుమ్మంముందు వెల్లకిలా పడిఉన్నాడు. బయటినుంచి ఎప్పుడూ లాక్ చేయబడే తలుపులు ఎలా తెరుచుకొన్నాయి అనేది అర్థంగాకుండా ఉంది.

"అదుగో దయ్యం.... పోతుంది.... పోతుంది........ పట్టుక్కోండి, పట్టుకోండి" అంటూ పిచ్చికేకలు పెడుతున్నాడు పంతులు.

ఇంతలో ఆ నిశీధిని చీల్చుకుంటూ మా వెనుకనుంచి భయంకరమైన పాట. 'నిను వీడని నీడను నేనే.... మదిలో కలగా....' ఏదో సినిమాలో పాట మవుత్ ఆర్గాన్‌మీద వినవస్తూ మమ్మల్ని దాటిపోతూంది. ఆ శబ్దంవెనుక కటిక చీకటిలో అస్పష్టంగా కనిపిస్తూ ఒక తెల్లని చీరచెంగు గాలిలో రెపరెపలాడుతూ వేగంగా పోతూ ఉంది.

"రేయ్! అందరూ పంతులుదగ్గరే ఉండండిరా" అని వాళ్ళను హెచ్చరించి దాని వెంబడి పరుగెత్తాను.

అందినట్టే అంది, దూరంగా పోతూఉంది. ఆ చీకట్లోనే తెలిసిన ప్రదేశం కనుక దాన్ని శక్తికొద్దీ తరిమాను. అది అలా నన్ను వేధించి కంట్రోలు రూము దగ్గర మాయమై పోయింది. నేను నిరాశగా వెనుదిరిగాను పంతులు అలాగే పిచ్చిగా కలవరిస్తున్నాడు. నేనువచ్చిన పది నిముషాలకు మెర్క్యురీలైట్లు గుప్పున వెలిగాయి. ఇప్పుడు ఆఫీసంతా పట్టపగల్లా ఉంది. ఇక నేమాత్రం ఆలస్యం చేయకుండా అందర్నీ పురమాయించి పంతుల్ని చేతులమీద క్రిందికి మోసుకు వచ్చాము.

రోడ్డున పోతున్న ఓ ఆటోను పిలిచి పంతుల్ని దగ్గరలో ఉన్న హాస్పిటలుకు చేర్చాము. డాక్టర్ వెంటనే మత్తు ఇంజక్షను ఇచ్చాడు. పంతులు పిచ్చి కేకలు మాని నిద్రలోకి జారుకొన్నాడు. నేను ఈ విషయం వాళ్ళ తలిదండ్రులకు చెప్పడానికి బయలుదేరాను.

4

మరునటి రోజు ఉదయం ముఖమంతా ప్లాస్టర్సుతో, పీక్కుపోయిన ముఖాలతో, గీరుకుపోయిన చేతులతో వచ్చిన మమ్మల్ని చూసి అందరూ నవ్వారు. డేవిడ్ అయితే కాలు బెణికి కుంటుతున్నాడు. వాసూకి ఒక కన్ను వాచింది. చిన్న చిన్న దెబ్బలతో తప్పించుకొంది నేనూ, రాజేష్ మాత్రమే. నేను విషయాలేమీ చెప్పకుండా హాస్పిటలు పేరు చెప్పి 'పంతులుకు సీరియస్‌గా ఉంది. చూడాలనుకొన్న వాళ్ళు రండి' అన్నాను.

అందరం ఓ గంట పర్మిషన్ పెట్టి బయలుదేరాం. పంతులు మేం వెళ్ళేసరికి మత్తుతెలిసి ఇంతకుముందులా పిచ్చిగా అరుస్తున్నాడు. పంతులు తల్లి కళ్ళొత్తుకొంటూ ప్రక్కనే కూర్చొని ఉంది. పంతులు తండ్రి నావైపు తినేసేటట్లు చూశాడు. ఇవన్నీ జరగడానికి మూల కారకుణ్ణి నేనేనని అందరూ నా గురించి గుసగుస లాడుకొంటున్నారు.

నేను డాక్టర్ని పరిస్థితి అడిగాను.

అతను నన్ను పక్కగదిలోకి తీసుకువెళ్ళి "మిష్టర్ ఆనంద్! ఇది మామూలు జ్వరం కాదు. మామూలు జ్వరం అయితే నేను వాడిన మందులకు ఎప్పుడో టెంపరేచరు కంట్రోలుకు వచ్చిఉండేది. ఇది భయంవల్ల ఏర్పడ్డ జ్వరం. సైకలాజికల్‌గా ఆ భయం తొలగేవరకూ జ్వరంపోదు. ఇలాగే అరుస్తూఉంటాడు" అని చెప్పాడు.

"అయితే ఏం చెయ్యమంటారు డాక్టర్?"

"దీనికి ఒకటే మార్గముంది. అతనిలో ఆ భయాందోళనలు తొలగిపోవాలంటే అదేవిధమయిన సన్నివేశం కల్పించి, తరువాత లైట్ వేసి దయ్యాలు లేవని, వాళ్ళు మనుషులేననీ అతనికి తెలియజేయాలి. అప్పు డతను భ్రమలోంచి తేరుకొని యథాస్థితికి వస్తాడు...." అంటూ వేరేకేసు అటెండు కావడానికి వెళ్ళిపోయాడు డాక్టర్.

నేను ముందురాత్రి జరిగిన విషయం, డాక్టర్ సలహా అందరికీ వివరించాను. దయ్యాల విషయం కనుక ఎవరూ ముందుకు రాలేదు. అవంటే అందరికీ నమ్మకముంది.

"ఆనంద్!....ఆ మగదయ్యంగా నేను నటిస్తాను" అన్నాడు అశోక్ ఓ అయిదు నిముషాలు ఆలోచించి.

"నువ్వా!...." అన్నాను ఆశ్చర్యంగా.

"అవున్రా నేనే! ఓహో! భయస్తుడ ననుకున్నావు కదూ. నిజమే. ఒక అనవసర విషయం కోసం టైం వేస్టు చేసుకోవడం ఇష్టంలేక అప్పు డలా అన్నాను. కాని ఇప్పుడు అత్యవసర సమయం. ఒక ప్రాణాన్ని కాపాడాలి. పరోపకారం ఇదం శరీరం" అన్నాడు వాడు దృఢంగా. అశోక్ చాలా తెలివిగలవాడు. పోస్టు గ్రాడ్యుయేట్ కూడా. వాడంటే అందరికి మంచి గౌరవం.

నేను లేడీస్‌వైపు చూశాను. అందరూ తలలు వంచుకున్నారు. మొదటిది దయ్యాలతో పేచీ అయితే, రెండవది ప్రేయసిగా నటించడం. ఎవరు ముందుకు వస్తారు?

"అలా నటించానని తెలిస్తే మా వాళ్ళు చంపేస్తారండీ" అంది ముంతాజు భయంగా.

"అమ్మో! దయ్యాలతో నే!" గుండెమీద చెయ్యానించుకుంది రజని.

ఇక ఆడవాళ్ళలో ఎవరూ రారని తీర్మానించుకుని ఒక లేడీ ఆర్టిస్టుని దీని కోసం వినియోగిద్దామనుకున్నాను.

"నేను ఆ మోహినీ పిశాచిగా నటించడానికి సిద్ధం" అంది రాగిణి ప్రశాంతంగా.

ఆడవాళ్ళంతా ఆమెపైపు అసహ్యంగా చూశారు, ఇంతకు తెగించిందా అని. నేను ఉలిక్కిపడ్డాను. ఆమె ఆ విధంగా నటిస్తాననా్న ఒప్పుకోను. ఎందుకంటే, దేవుడు ఆ అమ్మాయినుదుట కష్టాలే రాసిఉన్నాడు. భర్తచే వదిలివేయబడ్డ స్త్రీగా నా కామెమీద సానుభూతి ఉంది. మిగతా ఆడవాళ్ళు ఆమెను గురించి చెవులు కొరుక్కుంటూంటే ఒక మూలచేరి కన్నీరు తుడుచుకోవడం చాలాసార్లు చూశాను.

"నువ్వు వద్దు, రాగిణీ! నేనో డ్రామా ఆర్టిస్టును మాట్లాడుతాను."

"ఇందులో అంత అవమానపడాల్సిన విషయ మేముందండి? ఒకవేళ నా సోదరుడే ఆ పరిస్థితిలో ఉంటే ఆదుకోవడం నా ధర్మం కాదంటారా?" అంది.

ఆమె కళ్ళలో తడి. నేనేం మాట్లాడలేకపోయాను. మనసులోనే ఆమె విశాల హృదయానికి జోహారు లర్పించాను.

ఆ రోజు తీరికున్నప్పుడల్లా వాళ్ళచేత ఆ మాటలు చెప్పించి, వాళ్ళిద్దరికి ట్రెయినింగు ఇచ్చాను. మొదట్లో మోహినిలా నవ్వడానికి చాలా అవస్థ పడింది రాగిణి. అశోక్ గొంతు అంత గంభీరంగా ఉండటంలేదు. గరకు రావడంకోసం ఒక రకమయిన చాక్లెట్లు కూడా చప్పరించాడు. ఎలాగయితేనేం, రాత్రి ఏడు గంటలకు కార్యక్రమం నిర్ణయమయింది.

డాక్టర్ నా కోరికమీద అక్కడకు రావడానికి అంగీకరించాడు. ఆ వింత చూడ్డానికి చాలామంది వచ్చిచేరారు 'పై' సెక్షన్లో. డాక్టరు వాళ్ళెవరూ మాట్లాడ కూడదని, చాటుగా ఉండాలని హెచ్చరించాడు. మేము పంతుల్ని పైకి తీసుకు వస్తున్నాము. పంతులు పెద్దగా అరుస్తున్నాడు "అదుగో దయ్యం. పోతూంది. పట్టుకోండి, పట్టుకోండి" అంటూ. మేము బలవంతంగా అతణ్ణి 'డి' సెక్షను హాల్లోకి లాక్కొచ్చాము.

డాక్టరు ఆజ్ఞను పురస్కరించుకుని ఒకడు వెళ్ళి మెయిన్ ఆఫ్ చేశాడు. అంతా చీకటి. గాఢాంధకారం. ఆలస్యం లేకుండా నాటకం మొదలయింది. ఫేర్ కాపీ సెక్షనులో రెండు మిషన్లమీద టైపు చేస్తున్నట్లు శబ్దమయింది.

"ఎవరు టైపు చేసేది?" అరిచాను. తరవాత వాళ్ళ డైలాగులూ, నవ్వులూ వినిపించాయి. సన్నివేశం పకడ్బందీగా జరిగింది.

"అదుగో దయ్యం. పోతూంది. పట్టుకోండి పట్టుకోండి." పంతులు పిచ్చి కేకలు ఎక్కువయ్యాయి. టప్పున లైట్లు వెలిగాయి.

''మిష్టర్ పంతులూ! వాళ్ళు దయ్యాలు కారు. మనవంటి మనుషులే. చూడు" అంటూ ఫేర్‌కాపీ సెక్షనులో పైపుమిషన్ల ముందు కూర్చొనిఉన్న అశోక్‌ను, రాగిణిని చూపించాడు డాక్టరు.

అంతవరకు సగం కళ్ళు మాత్రమే తెరిచి అధోలోకంలో ఉండి మాట్లాడే పంతులు ఇప్పుడు కళ్ళు పూర్తిగా విప్పార్చి చూశాడు.

"అయితే. అయితే వాళ్ళు దయ్యాలు కారూ...." ఆశ్చర్యంగా అడిగాడు పంతులు.

"కాదు. మనలాంటి మనుషులే. భ్రమలు వదలిపెట్టు, పిచ్చి పంతులూ" అన్నాను భుజం తట్టి. పంతులు ఆ దృశ్యంతో చాలా రిలాక్సయ్యాడు. డాక్టరు ఇంకేం భయముండదని నాకు హామీ ఇచ్చాడు. పంతుల్ని మెల్లిగా నడిపించుకుని వచ్చి రిక్షాలో కూర్చోబెట్టాము.

నేను రాత్రంతా ఆలోచించాను. పంతులుకు దయ్యాలు లేవని ఎలాగో నమ్మించాను. పోతే, అసలు దయ్యాలసంగ తేమిటి? అది ఎప్పటికయినా తేలవలసిన సంగతే గదా! మరుసటిరోజు అర్ధరాత్రి నే నొక్కడ్నే బయలుదేరాను. ఆఫీసు వెనుకనున్న శ్మశానంలోంచి గోడదూకి ఆఫీసు కాంపౌండులో ప్రవేశించాను. భవనం వెనుకనున్న పైపు పట్టుకొని మేడమీదికి చేరి వేకువజాము నాలుగు వరకు ఆఫీసు మూలమూలలా వెతికాను. నాకేం కనిపించలేదు.

*   *   *

మరురోజు ఉదయం పది గంటలకు నేను ఆఫీసులో ప్రవేశించగానే "సార్, మీకోసం ఈ కుర్రాడు ఇందాకట్నుంచి ఎదురుచూస్తున్నాడు" అంటూ ఓ కుర్రాడ్ని చూపించాడు అటెండరు ఆదెయ్య.

వాడికి షుమారు పదిహేను సంవత్సరాలుంటాయి. నన్ను చూడగానే నమస్కారం పెట్టి నాకో ఉత్తరం అందించాడు. కవరుమీద నా అడ్రస్ మాత్రమే ఉంది. ఫ్రం అడ్రస్ లేదు.

"సార్, ఈరోజు ఉదయం ఏడు గంటలకు భార్యాభర్తలమని ఓ జంట మా హోటల్లో దిగారు సార్. తొమ్మిదిగంటలప్పుడు నన్ను పిలిచి ఈ కవరిచ్చి, సాయంత్రం నాలుగుగంటలప్పుడు ఈ అడ్రసుగల ఆయనకు ఇవ్వమన్నారు సార్. ఏ పరిస్థితుల్లోనూ ముందుగా ఇవ్వకూడదని ఖచ్చితంగా చెప్పి, బహుమతిగా ఓ యాభై రూపాయలు కూడా ఇచ్చారు సార్ వాళ్ళ పరిస్థితికి నాకెందుకో భయమేసి బజారుపనిమీద వచ్చి మీ కందిస్తున్నాను. ఇక నేను వెల్తానుసార్" అంటూ వెళ్ళిపోయాడు హోటలు కుర్రాడు.

నేను ఆశ్చర్యంగా కవరు చించాను.

"మై డియర్ ఆనంద్,

ఇలా నీకు ఉత్తరం రాయవలసివస్తుందని నే ననుకోలేదు. స్నేహానికి ప్రాణమిచ్చేవాడివి, నీకు కాక మా ఆవేదన మరెవ్వరికి చెప్పుకోము.

నేను హైదరాబాదులో కాలేజీ చదివే రోజుల్లో ప్రేమలో పడ్డాను. ఒక దేవతను ప్రేమించాను. గుడిలో దేవుడిమీద ప్రమాణంచేసి ఆమె మెడలో తాళి కట్టాను. మానసికంగా, శారీరకంగా ఒకటయ్యాము. కాని విధి వైపరీత్యం....

చదువు కాగానే ఇంటికి వెళ్ళాను. రెండు, మూడు నెలలు గడవనిచ్చి విషయం చెప్పాను. మా తల్లితండ్రులు నామీద ఎగిరిపడ్డారు ఆస్తిలో భాగ మివ్వనన్నారు. కుటుంబంతో సంబంధాలు ఇంతటితో తెగిపోయినట్లే అన్నారు. నిన్ను కష్టపడి చదివించినందుకు మాకు ప్రతిఫలం ఇదా అన్నారు.

ఆరు నెలల వాగ్యుద్ధం తరువాత అన్నిటినీ తెగతెంపులు చేసుకొని నేను హైదరాబాదు వచ్చేశాను. నా దేవత కనిపించలేదు. వాళ్ళకుటుంబం అక్కడనుంచి ఎటో వెళ్ళిపోయిందని తెలిసింది. ఇంకో ఆరునెలలు పిచ్చివాడిలా హైదరాబాదు అంతా గాలించాను కాని వాళ్ళ ఆచూకీ తెలుసుకోలేకపోయాను.

చివరకు ఇంటికి వచ్చిన నాకు ఆర్థికంగా చితికిపోయిన కుటుంబ పరిస్థితులు నన్ను విచలితుణ్ణి చేశాయి. అప్పుల్లో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవడం, తమ్ముళ్ళనూ, చెల్లెళ్ళనూ వో దారికి తేవడం నా ధర్మం అనుకొన్నాను. చిన్నదో, పెద్దదో ఒక ఉద్యోగం సంపాదించుకొన్నాను.

నేను ఉద్యోగంలో చేరిన రెండోరోజే అదే ఆఫీసులో జాయినింగు రిపోర్టు ఇచ్చిన నా దేవతను చూసి మురిసిపోయాను. నేను ఆనాడు కట్టిన పసుపుతాడు అలాగే ఉంది. ఆమె స్వచ్ఛమయిన ప్రేమకు నా గుండె చలించింది. ఆమె వ్యథాభరిత హృదయంతో మాట్లాడలేకపోయింది.

ఆమెకు నామీద కోపమేమో అనుకొన్నాను. సాయంత్రం పోతూపోతూ ప్రకాశం పంతులు పార్కులో కలుసుకోమని సంజ్ఞ చేశాను. ఆ సాయంత్రం పార్కులో కలుసుకొన్నాము. ఆమెమాటలు విన్నతర్వాత ఆమెకు నా మీద ప్రేమ ఏమాత్రమూ తగ్గలేదని గ్రహించాను.

తను ఆరోజు తాళితో ఇంటికి వెళ్ళిందని, తన తల్లితండ్రులు అదిచూసి కులంకాని వాణ్ణి చేసుకున్నందుకు మండిపడ్డారని, వెంటనే తాళి తెంపెయ్యమని

పట్టుపట్టారన్నీ చెప్పింది. తాను చావనైనా చస్తాను గాని, అతనే నా భర్త అందట. దాంతో వాళ్ళు ఒకేఒక్క శపథం చేశారట.... అతన్నే గనుక భర్తగా ఎంచుకుంటే రెండో రోజే తాము శవాలుగా మారుతామని... వాళ్ళు అంతపనీ చేస్తారని భయపడి, తన పెళ్ళిమాట ఎత్తకూడదని హెచ్చరించి తాను ఒంటరిగా ఉండిపోయినట్లు నాతో చెప్పింది.

సంఘం దృష్టిలో మేము అపవిత్రులంగా చిత్రించబడేందుకు వీలులేకుండా ఈ విషయం సీక్రెట్‌గా ఉంచాము. ఏనాటికైనా మంచిరోజులు రాకపోతాయా అని ఒకరికొకరం సర్దిచెప్పుకున్నాము.

మనసా, వాచా ఒకటైన మేము ఇంకెంతకాలం దూరంగా ఉండగలం? అందుకే రాత్రిపూట ఆఫీసులో ఫేర్‌కాపీ సెక్షనులో కలుసుకునేవాళ్ళం. ఒకరి కష్టాలు మరొకరికి చెప్పుకొని వోదార్చుకొనేవాళ్ళం. అర్థరాత్రివేళ మేము కలుసుకోవాలంటే వాచ్‌మన్ సహాయం కావాలి. అందుకే యానాదితో మాట్లాడి నెలకో యాభై ఇచ్చే ఒప్పందంమీద అతన్ని దీనికి ఒప్పించాము.

ఆ రోజు దయ్యాల పరిశోధనలో పాల్గొనేముందు నేను, నా ప్రేయసి ఈ విషయంలో చాలావరకు ప్రతిఘటించాము. ఎందుకంటే, మా విషయం బయటపడుతుంది. మీరు నిజంగా రంగంలోకి దిగేసరికి, మిమ్మల్ని హడలు పుట్టించాలని యానాది సాయం కోరాము. అతను అంగీకరించాడు.

మొదట మిమ్మల్ని ఫోనులో భయపెట్టింది, తర్వాత ఫేర్‌కాపీ సెక్షన్ తలుపులు తీసి మవుత్ ఆర్గానుమీద పాడుతూ వెళ్ళింది యానాది. చీకట్లో ఎంతోకాలం నుంచి అలవాటు అయింది కనుక మిమ్మల్ని కలవరపెట్టి అతి తేలిగ్గా తప్పించుకోగలిగాము. ఇంత చేశాడని యానాదిని ఏమీ అనకండి. అతను సహాయంచేసింది డబ్బుకోసం కాదు.... మా పవిత్రమయిన ప్రేమను చూసి. కనుక అతని ఉద్యోగానికి ఏమాత్రమూ భంగం రానీయకండి. ఆ రోజు పంతులు ఆరోగ్యంకోసం దయ్యాలుగా నటించమంటే అసలు దయ్యాలం మేమే కాబట్టి, ఆ పాత్రల్లో జీవించి సన్నివేశం రక్తికట్టించాము.

ఫ్రెండ్, ఇక యానాది మాకు సహాయం చేయలేడు. మా జీవితాలకు అంతంలేదేమో అనుకొంటున్న మాకు పరిష్కారం దొరికింది. కొంతమంది చావుకు కారణమైన మేము సంసారం చేసేకంటే, మేమే ఈ లోకంనుండి తప్పుకోవడం ఎంతో మంచిదని నిర్ణయించుకొన్నాము. చరిత్రలో ప్రేమ కథలన్నీ విషాదాలే! ఇప్పుడు రాగిణి గర్భవతి కూడా. ఆమె కెన్ని అపవాదులో!

తీరని కోరికలు వచ్చే జన్మలోనయినా తీర్చుకుందామనే ఉద్దేశంతో వినోదా లాడ్జిలో ఇద్దరం కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నాం. మా చావుకు కారణం నీవేమోనని బాధపడకు. అపరిష్కృతంగా వున్న మా సమస్యకు ఏనాటికయినా పరిష్కారం ఇదే. మా ఆత్మహత్యకు మేమే బాధ్యులమని, ఆ మేరకు హామీ పత్రం టేబులుమీ దుంచాము. నిజమైన ప్రేమ ఎప్పుడూ బలికోరుతుంది మిత్రమా.

సమయ మాసన్నమైంది. ఇక సెలవు, సోదరా!

జన్మజన్మలకూ నీలాటి మిత్రులే కావాలని కోరుతూ,

....అశోక్."

నా కళ్ళలోంచి కన్నీళ్ళు ఏకధారగా కారసాగాయి. సినిమా రీళ్ళలా జరిగిన సంఘటనలు ఒక్కొక్కటీ గుర్తుకొచ్చాయి. చీకట్లో ఒక టేబులుమీద పెట్టిన వస్తువుల్ని ఇంకో టేబులుమీద వెతకడం, టెస్టుచేయకుండా ఎక్స్పయిర్డ్ సెల్సున్న టార్చిలైటును పట్టుకొచ్చి వెలగలేదనుకోవడం జరిగింది. యానాది పెద్ద మోనో ఏక్టర్. ఫంక్షన్స్‌లో ఎన్నోసార్లు స్టేజిమీద మిమిక్రీ చేసి జనాన్ని మైమరపించాడు. మమ్మల్ని ఆఫీసులో వదలివెళ్ళిన తరువాత దూరంనుంచి ఫోనులో రకరకాల గొంతులు పలికాడు. తరువాత మెయిన్ ఆఫ్‌చేసి మమ్మల్ని భయపెట్టాడు.

నా చేతిలోంచి ఉత్తరం ఎప్పుడో జారిపోయింది. అది అందుకొని పెద్దగా చదివాడు రాజేష్. అందరి గుండెలూ దుఃఖభార మయ్యాయి.

మూఢ విశ్వాసాలతో, మత తత్త్వాలతో వెనుకకు పయనిస్తున్న ఛాందస ప్రపంచం, సాంకేతిక పరిజ్ఞానంతో, సువిశాల భావాలతో, భాషలను, నాగరికతలను ఏకంచేసి ముందుకు పయనించే ఈ ఆధునిక ప్రపంచం ఒకటయ్యే దెప్పుడో? ఈలోగా ఈ రెండు పరిస్థితుల మధ్య నలిగే జీవితా లెన్నో?

నాలో చలనం వచ్చింది. తట్టుకోలేకపోయాను.

"మిత్రమా అశోక్, సోదరీ రాగిణీ. ప్రేమ ఎప్పుడూ బంధాల్ని శాశ్వతం చేస్తుంది కాని బలిని కోరదు. మిమ్మల్ని నేను రక్షించుకొంటాను." అరుస్తూ పరుగెత్తాను

★